# సింహాద్రిమీద

పది మైళ్ళు సైకిలు తొక్కిన ఆయాసం తగ్గడానికి బీడీ వెలిగించాను, గేటవతల గోడపక్కన నిలబడి. బీడీపొగ గుండెల్లో సుడిగాలి తిరుగుతుంటే ఆలోచించాను- మా కొత్త ఆఫీసరు రమ్మని ఎందుకు కబురంపించాడా! అని. ఇంతలోకి "అయ్యగారు రమ్మంటున్నారు రావయ్యా!"అంటూ లోపలి కాహ్వానించాడు కొండయ్య. అమృత తుల్యమైన ఆఖరి దమ్ము లాగేసి దవాలీ వెనకాలే వెళ్ళాను.

"శంకరం కాదూ నీ పేరు?" అన్నాడు మా ఆఫీసరు. మరి రిజిష్టరు చూశాడో, లేకపోతే నాలాంటి చిరుగుల గళ్ళకోటు వేసుకొన్న వాళ్ళందరికీ అదే పేరుంటుందో తెలియదు.

"చిత్తం" అన్నాను స్తంభం చాటునుంచి ఎదుటికొచ్చి చేతులు కట్టుకొని.

''నేను ఎల్లుండి సింహాచలం క్యాంప్ వేసుకొంటున్నాను.''

''చిత్తం.'' విశాఖపట్నం కొత్తగా ట్రాన్స్‌ఫర్ అయిన ప్రతీ ఆఫీసరుకీ ఇది పరిపాటే.

''సింహాచలం మహాక్షేత్రం అనీ, స్వామి మహత్యం చాలా గొప్పదనీ విన్నాను.''

''చిత్తం'' అన్నాను నా పదహారు సంవత్సరాల సర్వీసులోను కంఠోపాఠం చేసిన వేదాక్షరద్వయాన్ని మళ్ళీ వల్లిస్తూ.

''నీ చిత్తానికేంలేవయ్యా! దొరగారంటున్న దదికాదు. మన భద్రయ్యగారితో ఆయన కారు ఇక్కడకు రేపు సాయంత్రానికి పంపమని చెప్పి, అక్కడ పూజకి, క్యాంపుకి కావల్సిన ఏర్పాటులన్నీ చేయించు'' అన్నాడు కొండయ్య తలపాగా సవరించుకొంటూ.

ఆయన సాంకేతిక భాష అర్థమయినట్లు తలూపుతూ ఆయనకేసి తిరిగి "అయ్" అన్నాను మరో పర్యాయపదం ఉపయోగిస్తూ.

"ఎల్లుండి తెల్లారేటప్పటికి 6 గంటల కల్లా అక్కడుంటాము" అన్నా డాఫీసరు.

"అయ్యగారు, అమ్మగారు, అయ్యగారి అక్కగారు వస్తారు. సరిగా అరయ్యేయేళకి కాఫీ, ఫలారం పట్టుకొని బంగాళాకాడ సిద్ధంగా ఉండాలి" అన్నాడు కొండయ్య మళ్ళా వ్యాఖ్యానం చేస్తూ.

మరో రెండు "చిత్తం" ప్రయోగాలతో బయటబడ్డాను. ఇన్నాళ్ళకు తిట్లు తినకుండా ఆఫీసరు ఎదుర్నుంచి బయటపడ్డానన్న విజయగర్వంతో ఒక్క ఊపులో సైకిలెక్కాను. ఎప్పుడూ మోగని సైకిలుబెల్లు టంగుమని మోగింది.

* * *

ముందుగా మాఆఫీసరు, పక్కనే భద్రయ్య వెనకాల కొంచెం ఎడంగా నేను, కొండయ్యా మెట్లు ఎక్కుతున్నాము. మా ఆఫీసరు, ఆయన భార్య అసలే సుకుమారులు. అందులోను స్థూలకాయులు, పైగా ఎండ మాడ్చేస్తుంది. దానాదీనా మేము సగం మెట్లెక్కేటప్పటికి మాతో బయల్దేరినవాళ్ళు ప్రసాదాలు తీసుకొని ఎదురొస్తున్నారు. కాస్సేపటికి మార్గాయాసంతో అందరూ చతికిలబడ్డారు. కొంచెం దిగువగా చెట్టుచాటున నక్కి నేనూ, కొండయ్య బీడీలు వెలిగించాం. అక్కడ పరిసర ప్రాంతాల్లో గుడ్డలు పరచుకొన్న ముష్టాళ్ళు నేనూ కొండయ్య ఎంత అర్చినా వినకుండా మా ఆఫీసరు కుటుంబంమీద దండయాత్ర చేశారు. ఇంక లాభం లేదని తెగించి చివరకి భద్రయ్యగారు బేడకాసు మార్చి దగ్గరకొచ్చి అందుకో గల్గిన వాళ్ళలో ఓ అరడజను మందికి తలో కానీ ఇచ్చి, మిగతా రెండు డబ్బులూ జేబులో వేసుకొని మిగతావాళ్ళని కసిరి పొమ్మన్నాడు. ఇది చూసిన మా ఆఫీసరు "అబ్బబ్బ! నాకు మహా అసహ్యమండీ. ఎక్కడికి కెళ్ళినా ఈగల్లా మూగడం. పొమ్మంటే పోరు. ఎంతమందికని వేయడం? దయదల్చి ఒకళ్ళిద్దంకి వేస్తే మిగతావాళ్ళ పీడ వదలించుకోడం మన తరంగాదు. అదిగో చూడండి, ఆ వెధవ, ఇంతమంది ఇందాకణ్ణుంచి నయాన్ని చెబుతున్నామా! ఇంకా దగ్గరకే దేకుతున్నాడుగాని పోడు. పోరా వెధవా, పో! నువ్వు అర్చిచచ్చినా వెయ్యరు. అసలు మీరు మొదలెట్టకుండా ఉండవలసింది భద్రయ్యగారూ! నేను ఎందుకు

మానేశానసుకున్నారు" అన్నాడు. భద్రయ్యగారికి చచ్చినంత పనయింది. పుణ్యానికెడితే పాపం ఎదురయినట్లు. ఈ అఫీసరుకోసం తను తగలేసీదాంట్లో ఈ ముష్టి వెధవల! పారేసీదెంతలే అన్న ధీమామీద చేసిన ఈ కాస్త ఘన కార్యానికి వచ్చిన ప్రతిఫలంతోటి నీళ్ళు కారిపోయాడు.

"చిత్తం", "చిత్తం" "అంతేనండి" "తమరు చెప్పిందే నిజం...."

"పోరా వెధనా? పో! నీకు కాదూ చెబుతుంటే ఊ" అని గదమాయించాడు భద్రయ్య.

వాడుమాత్రం కదల్లేదు. అప్రయత్నంగా భద్రయ్య చెయ్యి జేబులోనిచిల్లర డబ్బులమీదకి పోయింది అనుమానంగా మా ఆఫీసరు చూసి "ఏమిటి మళ్ళీ తీస్తున్నారా?" అన్నాడు.

"అబ్బెబ్బె"

"అసలీ వెధవలకి ముష్టెయ్యడం తప్పండి!"

"చిత్తం, చిత్తం" అన్నాడు తన తప్పుకు పశ్చాత్తాప పడుతూ.

"కిందటి జన్మలో ఏ ఘోర మహాపాతకాలో చేసి, ఈ జన్మలో ఇలా అనుభవిస్తున్నారు. వీళ్ళనిలా ఏడవనివ్వాలసిందే."

"ఎందుకండీ ఈ జీవాలూ? సుఖపడాలి కనకనా? వీళ్ళనో తుపాకీతో కాల్చెయ్యాలంటాను వాళ్ళకీ సుఖం, మనకీ సుఖం" అన్నాడు భద్రయ్య.

"అబ్బెబ్బె, అది మళ్ళీ పాపం" తనలోని దయారసాన్ని చవిచూపిస్తూ మా అఫీసరన్నాడు.

''వాడి కర్మ పరిపక్వమయ్యేవరకు వాడినలా బాధపడనివ్వవలసిందే."

"చిత్తం'' అన్నాడు భద్రయ్య కొంచెం నిరుత్సాహంగా మొత్తంమీద ఆ కుంటివాడు మాత్రం తన జన్మహక్కు-కోసం ఏకగ్రీవంగా పోరాడుతున్నాడు.

దీనితోటి భద్రయ్య మొహం, మా అఫీసర్ మొహంకూడా ఎర్రపడిపోయాయి. ఇక పరిస్థితి శ్రుతిమించి రాగానికి పడుతుందేమోనని నేనూ, కొండయ్య గబగబ వెళ్ళి ఆ దేకే కుంటాణ్ణి చెరో జెబ్బా పట్టుకుని వాడి నవతలికి మోసుకెళ్ళి పారేశాము.

ఇదంతా చూసిన తర్వాత కల్గిన చైతన్యంచేత కాబోను, మా ఆఫీసరు నిజం చెప్పవలసివస్తే, భద్రయ్యగారూ! ఈ కొండలెక్కడం, తీర్థాల కెళ్ళడం,

పాటక జనానికిగాని మనక్కాదు. ఈ దేవుడు మనింట్లో లేడూ? ఈ ముష్టి వెధవల మధ్యనుంచి, అడ్డమైనవాళ్ళనీ రాసుకుని పూసుకుని, కాళ్ళు పచ్చి పుళ్ళయ్యేలాగ ప్రయాసపడి యీ కొండలూ, గోపురాలూ ఎక్కడంకంటే, నన్నడిగితే నిశ్చలంగా యింట్లో ఏ దేవుడిది కావలిస్తే ఆ విగ్రహం పెట్టుకుని పూజించడం వుత్తమం అంటాను' అన్నాడు.

అసలే యీ మధ్య వ్యాపారంలో దెబ్బతిన్న భద్రయ్యగా రిది విని పోనీ యీ రకం ఖర్చులు తగ్గినా తగ్గదమే అనే వుద్దేశ్యంతోలాగుంది, కాస్త తేటపడ్డ మొహంతోటి 'అవ్వే అంతేనండి' అన్నాడు.

ఇరవై మంది స్కూలుకుర్రాళ్ళకి తన అధిపత్యంతో కొండెక్కుతూ మా కంటే పది మెట్లు పైని చతికిలపడ్డ ఓ బట్టతల మేష్టారు యిదంతా విని మా ఆఫీసరు కేసి, భద్రయ్యకేసి తీక్షణంగా ఒక్క చూపు చూసి, ఏదో గొణుక్కుని లేచాడు. పిల్లలందరూ ఒక్కసారి సింహాద్రి అప్పన్న చెవులు దిమ్మెత్తే లాగ 'గోవిందా! గోవింద' అంటూ మళ్ళీ మెట్లెక్కడం మొదలెట్టారు.

మొత్తంమీద కొండెక్కాము. మా ఆఫీసరు దంపతులు కొండధారలో స్నానాలు చేస్తున్నారు. మెట్ల దగ్గర నేను చతికిలబడ్డాను.

'అదిగోరోయ్........' పైకి చూశాను. మెళ్ళో కెమేరా తగిలించుకున్న కుర్రాడు మెళ్ళో ఫ్లాస్క తగిలించుకున్న కుర్రాడితో అంటున్నాడు.

'ఎవడో సకుటుంబంగా కూసం విడుస్తున్నాడు. అలా దగ్గరగా వెళ్ళకు, కడిగేసుకున్న ఆ పాపం తుంపర్లు మీద పడతాయ్.'

'ఆc........ద్రావకంలో ముంచినా పోని పాపాలు నీళ్ళతో కడిగేసుకుంటే పోతాయా?' అన్నాడు ఫ్లాస్క మనిషి.

వాలకం అంతా చూస్తే కాలేజీ స్టూడెంట్సులా కనబడ్డారు. కిక్కురు మనకుండా ఊరుకున్నాను. కానీ ఇంతలోనే ఆలోచనా, అందులో అనుమానం కలిగేయి ఈ పాపనాశన ధారలో అంత మహత్తుందా? అయితే మహా ఘోర పాతకాలు చేసి, అందులో ఓసారి స్నానం చేసి తుడిచేసుకుంటే చాలు పోతా యన్నమాట....?

సహస్రనామాలు చదివించడానికి కావల్సిన ఏర్పాట్లన్నీ చేయించి, భద్రయ్యగారు ముందర దారితీశాడు. ఆయన వెనకాలే అందరూ గర్భగుడిలోకి

బయల్దేరారు. వెనకాల పళ్ళు, కుంకం పట్టుకుని కొండయ్య వెళ్ళాడు. ఆరేసిన తడిబట్టల కాపలాకి నేను మండపంలో ఉండిపోయాను. మండపం చివర ఇందాకటి బట్టతలాయన, హిస్టరీ మాస్టారులాగుంది గోపురం, మండపం, స్తంభాలు కుర్రాళ్ళకి చూపెడుతూ పురాతన శిల్పకళా నైపుణ్యాన్ని గురించీ, తదితర చరిత్రాత్మక, పౌరాణిక విషయాలు ఏకరవు పెడుతున్నాడు. కుర్రాళ్ళు మాత్రం కూడా తెచ్చుకున్న ఫలహారం పొట్లాల ఘుమఘుమలు మధ్యమధ్య వాసన చూసుకొంటూ, తుమ్మెంద, దాగుడుమూతలు, పేకాట విషయాలు గుసగుసలాడుతున్నారు. కాస్సేపటికి ఉపన్యాసం చాలించి, కాళ్ళు చేతులు విరక్కొట్టుకోకుండా జాగ్రత్తగా ఆడుకోమని ఆదేశించి వెళ్ళిపోయాడు. ఒక్కసారి కుర్రాళ్ళందరూ, మనస్సులో 'హిస్టరీ మాస్టారుకీ జై' అనుకొని గుంపులు గుంపులుగా పరుగెత్తారు.

మోళీవాడు సంచిలోంచి తీసినట్టు నెమ్మదిగా మేష్టారు లాల్చీ జేబులోంచి ఓ నారింజపండు, రెండరిటిపళ్ళూ బయటికి తీశాడు. నా వెనకాల ఓ ముసలాయన అప్పుడే ప్రసాదం చేత్తోపట్టుకొని గర్భగుడిలోంచి బయటపడి మండపం మీద కొచ్చేదేమో చల్లగాలి తగిలేటప్పటికి "ఆ హా హా పరమేశ్వరా! పాహిమాం, పాహిమాం" అంటూ చతికిల బడ్డాడు.

''ఏం బాబూ తీరిగ్గా కూర్చున్నారూ? దర్శనం జేసుకొన్నారా?'' అని అడిగేడాయన.

''మా దీవూరే... కొత్తేమీ లేదండి'' అన్నాను.

''భగవద్దర్శనానికి కొత్తేమిటి, పాతేమిటి? ఓసారి దర్శనం చేసుకొని తీర్థం పుచ్చుకురా! నాయనా! ఇవ్వాళ శనివారం, ఏకాదశి.'' సలహా యిచ్చేడు ముసలాయన.

''అలాగేనంటి మా ఆఫీసరుగారు లోపలికెళ్ళారు పూజ చేయించడానికి, ఆయన రాగానే....'' అంటున్నాను.

''మీ ఆఫీసరంటే మెట్లదగ్గర చతికిలబడ్డ ఆ లావుపాటాయినేనా?'' అడిగేడు మేస్టారు.

''అవునండి'' అన్నాను.

''అదేమిటయ్యా! కొండెక్కే వాళ్ళందరూ పాటకజనం, ముష్టి వెధవలూ అంటాడూ, అలాంటప్పుడు తనేం మొహం పెట్టుకొని వచ్చాడు?''

''అబ్బెబ్బె, ముష్టాళ్ళందరూ వచ్చి మీద పడుతుంటే వాళ్ళమీద విసుక్కుంటూ తిట్టారండి'' అని సమర్థించేను మా ఆఫీసర్ని.

''పాపం, వాళ్ళని తిట్టడం ఎందుకయ్యా? చేతనయితే ధర్మం చెయ్యాలి, లేకపోతే తనదార్ని తను పోవాలికాని'' అన్నాడు ముసలాయన.

''అసలు ముష్టి వెధవ కానివా డెవడండీ? ఆ ఆఫీసరు మాత్రం ముష్టి వెధవకాడూ? కావలసిన తట్టా బుట్టా తోటి పుట్టుకొచ్చాడా? భూమిమీద పడ్డాక చచ్చేవరకూ ప్రతివాడూ ఏదో రకమైన ముష్టి ఎత్తవలసిందే. గతిలేక కొందరు, నయాన్ని కొందరూ, భయాన్ని కొందరూ!'' మేస్టారన్నాడు.

''బాగా చెప్పావు నాయనా!.... ప్రాణభిక్ష దేవుడు, క్షీరభిక్ష తల్లి, విద్యా భిక్ష తండ్రి, బ్రతుకుతెరువు ప్రజలు. అంత్యక్రియలు బంధుమిత్రాదులు చేయ వలసిందే గదా! ఇదంతా ముష్టికాదూ? ఈ ముష్టి ధర్మం పేరుతో ప్రతి వ్యక్తి చేయవలసిందే, పొందవలసిందే.'' ముసలాయనన్నాడు వేదాంత ధోరణిలో.

"మీ వేదాంతమంతా ధర్మం నాలుగుపాదాలా నడిచే రామరాజ్యం రోజుల్లో నమ్మేవారేమో కాని, ఈ రోజుల్లో భూమ్మీద పడ్డాక పళ్ళు రాగానే తల్లిని కరవడం, మాటలు రాగానే అందర్నీ తిట్టడం, పెళ్ళాం రాగానే తల్లి నవమానిం చడం, సంపాదన మానేయగానే తండ్రిని ధిక్కరించడం, తను ధనవంతుడైతే చుట్టూ ఉన్న ప్రజల్ని జంతువుల్లా చూడ్డం.... ఇదీ ఈనాటి ప్రత్యక్ష వేదాంతం" అన్నాడు మేస్టారు.

"అజ్ఞానం నాయనా!.... అందరూ ఓలాగే ఉంటారా?''

"పెద్ద చదువు చదివి, పెద్దుద్యోగం చేస్తున్న వీళ్ళాఫీసరే అజ్ఞాని అయితే మీ వేదాంతం గ్రహించగల్గిన మహాజ్ఞాను లెంతమందండీ మన దేశంలో?''

మొదట్నుంచీ మేస్టారు ప్రవర్తన మాత్రం నాకు వింతగా తోచింది. మాట్లాడుతున్నప్పుడు ఆయన మొహంలో ఆవేదనకాని, కోపంకాని, ఉద్రేకం కాని లేవు. ప్రశాంతంగా ఆయన నారింజపండు ఒలుచుకొని తీరుబడిగా ఒక్కొక్క తొనగింజలు తీసేసుకొని తింటూ, మేము వింటున్నామో లేదో కూడా అక్కర్లేకుండా, మొహమేనా మా వైపు తిప్పకుండా మాట్లాడుతున్నాడు. నా వెనకాల కూర్చున్న వృద్ధుడికి మాత్రం- వేదాంతగోష్ఠి కలవాటు పడ్డాడేమో, మేస్టరు

ధోరణి పిడివాదంగా తోచినట్టుంది. దాంతోటి మాట తప్పించి నాతో సంభాషణ కుపక్రమించాడు.

"నీకు సంతానం ఎంతమంది నాయనా?" ముసలాయినడిగేడు.

"ఏడుగురండి" అన్నాను, నేరస్తుడిలాగ తల దించుకొని.

"బాగుంది నాయనా! అదృష్టవంతుడివి."

''అదృష్టం కాకపోవడ మేమిటి?'' వ్యంగ్యంగా అన్నాడు మేస్టారు.

నేను మాట్లాడలేదు. వృద్ధుడు మాత్రం కొంచెం మొహం చిట్లించు కొన్నాడు.

"మీ ఆఫీసరుగారి కెంత మంది నాయనా?''

''లేరండి!''

"ఎందుకుంటారు? మహారాజులు సంతానంకోసం యజ్ఞాలు చేయటం, కుచేలుడిలాంటి గర్భదరిద్రుడికి గంపెడు పిల్లలుండటం మనకి పురాణయుగం నుంచీ వస్తున్న సంప్రదాయమే.'' అన్నారు మేస్టారు తన సహజ ధోరణిలో.

''ఎంత ధనం వుంటే ఏం లాభం బాబూ, సంతాన భాగ్యం లేక పోయాక?'' ఇది ముసలాయన వుద్దేశ్యం.

''అలా అనుకొనే మన దురదృష్టాన్ని సమర్థించుకోడం" అన్నాడు మేస్టారు.

"అదేమిటి నాయనా, సంతానం లేనివాడికి ముక్తెక్కడిది-నరకం తప్ప."

''సంతానం లేకపోతే అప్పుడు నరకం. ఈ దరిద్రంలో సంతానంతో యిప్పుడు నరకం. అందుకే ప్రభుత్వం కూడా అధిక సంతాన నిరోధన మార్గాల్ని ప్రోత్సహించింది.''

''హుఁ........ఈ ప్రభుత్వాలు, రాజకీయాలు మానవ కల్పితాలు బాబూ! సంతానయోగం విధాత విరచితం."

''ప్రత్యక్షంగా ఆపరేషన్లు చేసి పారేస్తుంటే మీకింకా ఏమిటో దేముడూ, దెయ్యం అంటారు."

''తప్పు నాయనా! ఒక్క విషయం చెప్పు. మన తల్లిదండ్రులే ఆ పాప మార్గా లవలంబిస్తే అసలు మన మందరం పుడుదుమా?"

''పుట్టకపోతే సుఖపడుదుము. ఈ భూమిమీద పడిన మొదలు చచ్చేవరకు యాతనే కదుటండీ? ఇంతకూ మన తల్లిదండ్రులు కనేముందర మనల్ని అడిగి కన్నారండీ? అలా అడిగితే మనం కనమందుం గనకనా?''

''మహాపాపం బాబూ, అలాంటి పనుల కొడిగట్టితే శిశుహత్య చేసినంత పాపం."

''తినడానికి కడుపునిండా తిండి, కట్టుకోవడానికి బట్ట, చదువు సంధ్యలు, సుఖం ఇవ్వలేనివాళ్ళం సంతానాన్ని కని, కత్తుల బోనుల్లాంటి యీ లోకంలో పారేయడమంత పాపంకాదు, అసలు కనకపోవడం.''

''నారు పోసినవాడే నీరు పోస్తాడు.''

''నీరు పోయలేనివాడు నారు పొయ్యకూడదు."

"నారూ నీరూ పోసేది మనమేనని మనం భ్రమ పడతాం బాబూ!"

"వేదాంతంలో మీకింత నమ్మక ముండడం చాలా అదృష్టం. కాని, వాస్తవిక జగత్తు మాట నేను మాట్లాడుతున్నాను. పురాణ యుగంలో గుప్పెడటుకులు శ్రీకృష్ణమూర్తికిచ్చి అష్టయిశ్వర్యాలు సంపాదించాడు కుచేలుడు. రెండు నెళ్ల జీతం లంచమిస్తానన్నా వుద్యోగమిచ్చే నాథుడు లేడీ రోజుల్లో.''

''వెర్రివాడా! ఆ కుచేలుడు మాత్రం ఎన్నాళ్ళు దరిద్రం అనుభవించ లేదూ? దేనికేనా ఆ ఘడియ రావాలి.''

''ఆ ఘడియ లొచ్చేలోగా తరాలు, యుగాలు గడుస్తున్నాయి. కడుపు కోసం సైన్యంలో చేరి, యుద్ధంలో వేలకువేలుగా చచ్చే దౌర్భాగ్యుల్ని ఏ దేవుడు రక్షించాడు? కరువుకాటకాల్లో తోటి మానవులు కళ్ళప్పగించి చూస్తుంటే ఆకలితో గిజగిజ తన్నుకొని చచ్చే దరిద్రులు దేవుడు కళ్ళకి కనబడలేదూ? పోషించే దిక్కులేకా తన వాళ్ళని తన చేతులతో చంపుకొని, తను చచ్చిన అభాగ్యుల్ని ఎందుకు చూడడా దేవుడూ? వాళ్ళ కసలా ఘడియ రాలేదేం?.''

''పుట్టుట గిట్టుటకొరకే అన్నారు. ఎంతటి వాళ్ళకేనా చావు తప్పదు అనాడు చావు రాసి పెట్టుటే ఏదోవిధంగా చావక తప్పదు వాళ్ళకర్మ ఆనాటితో పరిపక్వమైందన్నమాట. ఇంతకీ చచ్చిన వాళ్ళంతా అదృష్టవంతులు నాయనా! బాధలన్నీ బ్రతికున్నవాళ్ళకే."

"అవునాండీ? బతుకున్నవాళ్ళకే బాధలు, చచ్చినవాళ్ళు అదృష్టవంతులూ అవుతే అసలు పుట్టకుండా ఉండడం మంచిదికాదూ?''

"ఇదంతా దైవసృష్టి బాబూ! ఈశ్వరాజ్ఞ లేందే చీమైనా కుట్టదంటారు. చేసేవాడూ, చేయించేవాడూ ఆ పరమేశ్వరుడే. మనం కేవలం నిమిత్తమాత్రులం."

''చేసేవాడూ చేయించేవాడూ దేవుడైతే ఇక మానవుడు చేసిన నేర మేముందీ? అయితే, తోలుబొమ్మల్లాగా మనల్నాడిస్తున్నాడన్నమాట! పోనీ, ఇదంతా ఈశ్వర సృష్టే అయినప్పుడు అన్యాయం, దుర్మార్గం, అసూయ, రోగాలు, కరువు లేని ప్రపంచాన్ని సృష్టించలేడూ?"

"మొదట ఈ ప్రపంచాన్నలాగే సృష్టించాడు. రానురాను మానవుడు తన మనశ్చాపల్యంచేత, అహంభావంచేత యీ స్థితికి తీసుకొచ్చాడు."

"పోనీ, దేముడు పురాణయుగంలో లాగ దుర్మార్గుల్ని స్వార్థపరుల్ని యిక్కడి కిక్కడే శిక్షించి, సన్మార్గులికి, కష్టజీవులకి ఆనందం యివ్వకూడదూ? అలాంటి ప్రత్యక్ష నిదర్శనాలుంటే ప్రపంచం క్షణంలో బాగుపడదూ?"

దీనితోటి ముసలాయన మొహం చిట్లించుకొని "బాగానేవుంది నాయనా!" అంటూ తన చేతిలో ఉన్న కొబ్బరికాయచెక్క నేల కేసి బద్దలుకొడుతున్నాడు. ఇంతలోనే భద్రయ్యగా రక్కడికి వచ్చి అయిదు రూపాయల నోటు నా చేతి కందిస్తూ "స్వామివారికి భోగం చేయించి ప్రసాదం 12 గంటలకి ఇస్తానన్నాడు ఆ పూజారి. మీరెళ్ళి 4 రూపాయలిచ్చి ఆ ప్రసాదం తీసుకోండి" అన్నాడు.

"అయితే, దొరగారు బయట కొచ్చేస్తున్నారా?" అన్నాను.

''ఇంక పదినిమిషాలలో వచ్చేస్తారు. అవును కాని, ఆ సంతాన స్తంభం రేటెంతండీ?''

"మూడు రూపాయలు'' అన్నాను.

"సరే. అయితే అక్కడ ఏర్పాట్లు చేయిస్తాను. మీరు బట్టలు పోగుచేసుకుని అందర్నీ అక్కడికి తీసికొని రండి" అన్నాడు.

ఆయన వెళ్ళిపోగానే మేష్టారు ఓసారి వెనక్కి తిరిగి—

"మీ ఆఫీసరుగారికి ఈ మహానుభావుడు ధర్మకర్తన్న మాట!.... హు.... నెలకి మీ ఆఫీసరుపాటి సంపాదిస్తున్న వాళ్ళు ఎంత మందున్నారు? ఇది చాలక

తన అధికారం పురస్కరించుకొని ముష్టెత్తడం! దిక్కులేని కుంటీ, గుడ్డీ ముష్టెత్తుతే గంట పాఠాలు చదివాడు మహానుభావుడు. మళ్ళీ కావల్సినంత దైవ భక్తి, బోలెడు వేదాంతం!''

"అదో ఆత్మవంచన, అజ్ఞానం....'' ముసలాయన మళ్ళీ మొదలెట్టేడు.

"అసలు రహస్య మేమిటంటే ధనంలో వున్న నమ్మకం దైవం మీద లేదు 'ధనమూల మిదంజగత్' అని హృదయం శంఖారావం చేస్తూవుంటే నోటితో మాత్రం 'జగమంతా రామమయం' అని పాడుతుంది ఈ ప్రపంచం. ముందర రూపాయణాపైసలు లెక్క చూసుకొని, తర్వాత ముక్తిమార్గ మాలోచిస్తుంది. కలిగివున్నవాళ్ళ మాటే చెప్పండి - తీరుబడయినప్పుడల్లా ఓసారి తిరపతి వెళ్ళి రమ్మంటే వెడతారా? ఖర్చుకు తగ్గ ఫలితం లేందే ఎందుకు వెడతారు? అదే-మొక్కు తీర్చడానికి, అమ్మాయి కడుపున కాయ కాసిందనో, అబ్బాయికి టైఫాయిడ్ జ్వరం గండం గడిచిందనో వెడతారు.''

ముసలాయన మాత్రం అంతవరకు విన్నట్టే విని ఏమనుకున్నాడో ఏమో "మీరు నాస్తికులా?'' అన్నాడు.

''ఇవ్వాళ ఇక్కడ కొచ్చాను. అందరితోబాటు నేనూ స్వామికి దణ్ణంబెట్టి ప్రసాదం తీసికొని మరీ వెడతాను. దానివలన నాకు లాభం కల్గుతుందన్న నమ్మకం లేనప్పటికి నష్టంలేదని చూస్తూ ఉంటాను.'' అన్నాడు మాస్టారు.

"నమ్మకం లేకపోతే లాభం ఎలా వుంటుంది?''

"నమ్మకం అందరికీ ఉందని మీ రనుకుంటున్నారు. నమ్మకంపోతే పాపం అని భయం. రెండవది - కాస్తో కూస్తో లాభం ఉండకపోతుందా అన్న సందేహం ఏదుకేనా మంచిదని కొందరూ అందరితోబాటే మనం అని మరి కొందరూ.''

''అయితే, దేవుడిమీదా నమ్మకం లేకపోతే ఈ ప్రార్థనా, ఈ దణ్ణాలు ఎందుకు?''

''దేముడుమీద నమ్మకం అనేది మనిషికి ప్రపంచానికి మధ్య ఒక తెర, ఆ తెరలోంచే ప్రపంచాన్ని చూస్తాడు. అందుచేతనే ఈ ప్రపంచాన్ని సహిస్తాడు. క్షమిస్తాడు. ఈ తెర లేకపోయినట్లయితే ప్రపంచం యొక్క భయంకర నగ్న స్వరూపాన్ని చూసి సహించలేడు, క్షమించడు, పైగా, పగ సాధిస్తాడు.''

"పగ ఎవరిమీద నాయనా, సాధించడం?''

"కష్టపడి పనిచేసినా కడుపునిండా అన్నం పెట్టలేని సంఘం మీద; కళ్ళ ముందర అన్యాయంగా ప్రజల్ని దోచుకుంటున్న ధనదానులమీద; ప్రజల అజ్ఞానాన్ని పెట్టుబడిగానూ, ద్రోహాన్ని పని ముట్టుగానూ పెట్టుకొని స్వలాభం కోసం రాజకీయాలతో వ్యాపారం చేసే యీ నాయకుల మీద. దేవుడంటూ ఒక డున్నాడని నమ్మకం కొద్దీ వూరుకుంటున్నారు కాని, లేకపోతే వీళ్ళందర్నీ బావకొట్టి వెవులు మూసేద్దురు.''

"పూర్వజన్మ కర్మానుసారంగా వచ్చిన యీ జీవితాల్లో యిలాంటి దౌర్జన్యం చేస్తే మళ్ళీ జన్మలో యింతకంటే కనిష్టంగా బతకవలసివస్తుంది.''

"క్రిందటి జన్మలో ఎలాగున్నామో తెలుసుకనకనా; వచ్చే జన్మలో ఎలాగుంటామోనని భయపడ్డానికి.''

"అలా అని చెప్పి పాపాని కొడిగడతామా?''

"ఇందులో పాపమేమీలేదు. అన్యాయాన్ని ఖండిస్తూ చేసిన యుద్ధాల్ని మన పురాణాలే సమర్థించాయి. మహాభారత యుద్ధం, రామ రావణ యుద్ధం చూడండి.''

"అవన్నీ భగవంతుడు న్యాయాన్యాయాలు పరిశీలించి దగ్గిరుండి చేయించిన యుద్ధాలు.''

"గత రెండువేల సంవత్సరాలలోనూ ప్రపంచచరిత్ర పరిశీలిస్తే అనేక యుద్ధాలు జరిగేయి. అందులో ఎక్కడా దేముడు జాడలేదు. పోనీ, యుద్ధాలు తప్పాయా? ఎలా తప్పుతాయి? రావణాసురుడు పుట్టటంతోటె రామ-రావణ యుద్ధానికి పునాది లేచింది. అలాగే హిట్లర్, ముస్సోలినీలు పుట్టకపోతే రెండో ప్రపంచయుద్ధం వుండకపోను. దీన్నిబట్టిచూస్తే దేవుడే యుద్ధ ప్రేరకుల్ని పుట్టించి యుద్ధం తప్పనిసరి చేస్తున్నాడు. కాని, పురాణయుగంలో లాగ ఏదో ఓ పక్షానుండి తను చెయ్యిజేసుతోటంలేదు. మధ్య ప్రజలు నలిగిపోతున్నారు. పోనీ పర్యవసానాన్ని బట్టి భగవదేచ్ఛ ఎలా వుందో చూద్దామని చరిత్ర తిరగేస్తే యుద్ధంలో గెల్చిన దుర్మార్గులూ వున్నారు. ఓడిపోయి బలైపోయిన సన్మార్గులూ వున్నారు. జయాపజాయములు దైవాధీనము లంటారుగదా! మరి భగవంతు డేం చేస్తున్నట్టు?''

"అంచేత దేముడు లేడంటారా?"

"ఉన్నాకాని పైనుంచి చూస్తుంటాడు కాని, కలగజేసుకోడని చరిత్ర రుజావు చేసింది. అందుచేత న్యాయాన్ని ధర్మాన్ని నిలబెట్టవలసి వచ్చినప్పుడు దౌర్జన్యమైనా తప్పదు కుతంత్రమైనా తప్పదు. మానవు డాఖరువరకూ పోరాడి వాటిని సాధించాల్సిందే."

"ఐతే, అన్యాయంతో న్యాయాన్ని సాధిస్తారుటండీ ?"

"అయ్యో! న్యాయంయొక్క స్వరూపమే మారింది. కళ్ళకి కనబడుతున్న సత్యాల్నే ఆధారంగా చేసుకొని మానవుడు తయారు చేసిన న్యాయచట్టం ఇప్పుడు అమలులో ఉంది. వెనుకటి రోజుల్లో బ్రహ్మభేద్యమైన రహస్యాలు మానవుడు తెల్సుకోలేనప్పుడు న్యాయాన్ని నిలబెట్టడానికి దేముడు ప్రత్యక్షమయ్యేవాడు. లేకపోతే సారంగధరుడు మళ్ళీ బతికి బట్టకట్టడం, చిత్రాంగి శిక్ష పొందడం రాజరాజ నరేంద్రుడి ప్రతిభా? సర్కారు సొమ్ము ఆరులక్షలు తన సొంత సొమ్ములా ఖర్చుపెట్టిన రామదాసు చెరసాలలోంచి బయటపడ్డా డంటే ఆ రాముడు కలుగజేసుకున్నాడు కాబట్టి! అదే ఈ రోజుల్లో అవుతే సారంగధరుడికి మరణశిక్షా తప్పదు. రామదాసుకు యావజ్జన్మ కారాగారమూ తప్పదు. వంటరిగా చూసి సాగదీసి నన్నో లెంపకాయ ఎవడో కొట్టాడంటే ఏ దేవుడూ వచ్చి సాక్ష్యం ఇవ్వడు. నాకు న్యాయం కావలసివస్తే నలుగురు దొంగ సాక్షుల్ని పెట్టి కోర్టులో రుజువుచేసుకోవల్సిందే. ఏమంటారు?"

"ఏమంటాను బాబూ? ఆ జగన్నాటక సూత్రధారి చిద్విలాసము అవగాహన చేసుకోడానికి మానవమాత్రులం మనకి తరమా?"

"మానవమాత్రులం కనుక నే ఈ బాధ! దేవతలమైనా, రాక్షసులమైనా ఈ బాధే లేదు."

"బాగుంది బాబూ!...."

ముసలాయన దీంతోటి "పచ్చివెలక్కాయ గొంతుకు" మొహం పెట్టాడు. నుదుటి మీద విభూది కట్లు ఓసారి ముడుచుకున్నాయి. మేస్టారు మొహంలో మాత్రం మామూలుగా ఏవిధమైన భావ ఆవేశాల ప్రకటన లేదు. దూరంగా ఆడుకుంటున్న కుర్రాళ్ళకేసి చూస్తున్నాడు. మా ఆఫీసరు దంపతులుకాని గర్భగుడిలోంచి బయటకు వస్తున్నారేమోనని తొంగి చూశాను. ఇంకా లేదు.

మేస్టారు ముసలాయన్ని అడిగేడు: "మీరేం జేస్తున్నారు?"

"పిత్రార్జితం అయిదెకరాల మాగాణీ ఉంది. ఇన్నాళ్ళు స్వంత వ్యవసాయమే నడిపించు కుంటూ వచ్చాను. ఇక నాకు కొడుకయినా కూతురయినా ఉన్నదల్లా ఒక్కగా నొక్క కూతురు. ఏదో కాస్త కలిగున్న అయ్యచేతిలో పెట్టేశాను. వాళ్ళకి ఇద్దరు పిల్లలు బయల్దేరారు. ఆ పరమేశ్వరుడి దయవల్ల ఏ చీకూ చింతా లేకుండా రోజు లెళ్ళిపోతున్నాయి.''

''అదృష్టవంతులు. మరి వేదాంతం మీకు పట్టుపడకపోతే నాకు పట్టుబడుతుందా?''

''మీకేం లోటు బాబూ?''

''నాకున్న లోటల్లా అదృష్టం. ఇక సంతాన భాగ్యమన్నారా, పోయిన వాళ్ళు పోగా, మిగిలినవాళ్ళు తొమ్మండుగురండి. అయిదుగురు మగపిల్లలు, నలుగురు ఆడపిల్లలు. పెద్దవాడు ఎలిమెంటరీ స్కూలు మేస్టరు. వాడికి నలుగురు పిల్లలు. రెండు సంవత్సరాలయింది భార్యపోయి. పునర్వివాహం చేసుకోలేదు. రెండోవాడు మీరిందాకా అన్నారే 'నాస్తికుడువా' అని - అదుగో. ఆ నాస్తికుడు వాడు. పెళ్ళికూడా చేసుకోలేదు. ముప్పై ఏళ్ళొచ్చాయి. కలెక్టరాఫీసులో గుమస్తా. ఏ నాస్తికుడైతేనేం .... వాడివల్లే కాస్త కొంప నిలబడుతోంది. కానీ వృధా చెయ్యకుండా అంతా ఈ సంసారానికే ఖర్చు పెడతాడు. మూడోవాడు ఎంతో నెమ్మదస్తుడు. నాలుగేళ్ళబట్టి కంపెనీలో పని చేస్తున్నాడు. ఇప్పుడో వంద రూపాయలిస్తున్నారు. అంతా సంవత్సరమైంది. పెళ్ళికూడా చేశాను. మరి ఇది మా అదృష్టమో వాడి భార్య అదృష్టమో, తెలియదు. అంతా రెండు నెలలయ్యింది- వాడికి క్షయ దగ్గని నిర్ధారణ చేశారు. వాడి భార్యకి కడుపు. పుట్టింటికి వెళ్ళింది. మొన్ననే పదిరోజులయింది. తల్లిని సాయమిచ్చి వాడిని మదనపల్లి పంపించాను. నాలుగోవాడు రెండు సంవత్సరాలు ఉద్యోగం కోసం ప్రయత్నించి విసిగి మిలిటరీలో చేరాడు. అయిదోవాడు ఈ ఏడు మెట్రిక్యులేషన్ పరీక్ష కెడతాడు. ఆడపిల్లల్లో ముగ్గురికి పెళ్ళిళ్లు చేశాను. ముగ్గుర్నీ రెండో పెళ్ళివాళ్లకే ఇచ్చాను. రెండో దానికే అన్యాయం జరిగిపోయింది. పెళ్లయిన రెండు సంవత్సరాలకే భర్తపోయాడు. ఇక ఆఖరిపిల్ల రెండవవాడి పట్టుదలమీద చదువుతూంది. ఈ యేడు స్కూలుఫైనల్లోకి వస్తుంది. వచ్చేయేడు దాన్ని నర్సు ట్రైనింగుకి పంపుతానని వాడి పట్టు.... అయ్యా, ఇదీ నా కటుంబ పరిస్థితి.''

అంతా చెప్పి మేస్టారు ఓ నవ్వు నవ్వాడు. ఆయన జీవితం నా కళ్ళకి కట్టినట్లయింది. ఆ నవ్వు వెనకాలవున్న ఆవేదన, సహనం మొండి ధైర్యం, ప్రపంచానుభవం తలుచుకొంటే ఒళ్ళు కంపించింది. అంతవరకూ వింతగా ఆయన మొహంలోనీ చూసేవాణ్ణి సూటిగా ఇప్పుడు చూడలేకపోయాను. ముసలాయన కూడా తల దించుకొని, మాట్లాడలేక తడబడే చేతుల్లో కుంకం పొట్లం అందిస్తున్నాడు.

"వేదోక్తమైన ఆశ్రమ ధర్మానుసారంగా గృహస్థాశ్రమాన్ని స్వీకరించిన నా నేరానికి నేనే కాకుండా నా భార్యా, సంతానం కూడా శిక్ష అనుభవిస్తున్నారు. ఆ దారిద్ర్యాన్నుంచి బయట పడ్డానికి మానవ సాధ్యమైన ప్రయత్నాలన్నీ చేశాను. తత్ఫలితంగా న్యాయంలోనూ, దైవంలోనూ నమ్మకం తగ్గింది. నే గ్రహించిందల్లా మానవుడు మనసా భయస్తుడు, వాచా భగవద్భక్తుడు, కర్మణా నాస్తికుడు. మానవుడికి అతీతమైందేదీలేదు. తల్చుకుంటే ఈ లోకాన్ని స్వర్గ తుల్యంగా చెయ్యొచ్చు. దానికి అంతులేని స్వార్థాన్ని కొంతవరకూ అరికట్టుకోవాలి. అది చెయ్యలేక పురాణ గ్రంథాల్లోని దేవుణ్ణి పైకితీసి ఆకారం ఇచ్చి బొమ్మ చెక్కి రంగులేసి దాంతోటి కష్టజీవులమీద మత్తుమందు జల్లుతున్నాడు. 'కర్మ' పేరుచెప్పి అన్యాయాన్ని న్యాయంగా సమర్థిస్తున్నాడు" అన్నాడు మేస్టారు.

కొండయ్య కేకవిని బట్టలమూట తీసికొని బయల్దేరాను. 'సంసారం సాగరం దుఃఖం....'' ముసలాయిన గొంతుకు దూరంగా వినపడుతోంది. ఒక్క పరుగులో మా ఆఫీసరు కుటుంబాన్ని కలుసుకున్నాను. సంతాన స్తంభం దగ్గరికి తీసుకొని వెడుతున్నాను. భద్రయ్యగా రెదురొచ్చాడు. అక్కడే మండపంమీద ఓ చిన్న వినాయకుడి విగ్రహం వుంది. అక్కడ అర్చకుడు పళ్ళెం అడ్డం పెట్టేటప్పటికి ఆఫీసర్‌గారు జేబు తడుముకున్నారు. ఇంతలో భద్రయ్య యిందాక బేడకాసు మార్చి ముష్టివాళ్ళకి పడేయగా మిగిలిన రెండుకానులు ఆఫీసర్ చేతులో బెట్టాడు తను వెయ్యకపోయినా యీ దేముడు ఏమీ అనుకోడనే దీమామీద ఆ రెండు కాసులు అక్కగారిచేత, భార్యచేత వేయించాడు. ప్రసాదం బాపతు ఓ కొబ్బరి చెక్క తీసుకోమని నాకిచ్చాడు.

సంతాన స్తంభానికి కొంచెం దూరంగా మంటపంమీద అందరూ చతికిల బడ్డారు. 'సంతానం కల్గుతే ఏ పేరెట్టాలని మొక్కుకోడం' అనే సమస్యొచ్చి

పడింది కొండయ్య సింహాచలం దేముడి పేరుకే ఓటేశాడు. కొండయ్యకైతే యిబ్బందిలేదు. మగపిల్లాడు పుడితే 'అప్పన్న' అని, ఆడపిల్లపుడితే 'అప్పలమ్మ' అని నిస్సంశయంగా పేరెడతాడు. కాని, లేక లేక పుట్టబోయే మా ఆఫీసరు సంతానానికి అలాంటి పేరు పెట్టడమంటే ఆయన మనస్సు చివుక్కుమనదూ?

''ముందర మొక్కుకోండమ్మా! తరవాత చూసుకొందాం'' అన్నాడు కొండయ్య ప్రాణం విసిగి. చివరికి భద్రయ్యగారి సలహామీద మొగపిల్లవాడు పుడితే 'అప్పలనరసింహారావు,' ఆడపిల్ల పుడితే 'సింహాద్రమ్మ' అని పేరెడతామని మొక్కుకోడానికి ఒప్పుకొన్నారు.

మా ఆఫీసర్‌గారూ భార్యా సంతాన స్తంభం దగ్గరికి వెళ్ళేరు. కుంకం పెట్టుకున్నారు. నమస్కారం చేశారు. స్తంభానికి కట్టిన ఎర్రగుడ్డ తీసేశారు. స్తంభాన్ని రెండుచేతుల్తోటి ఆలింగనం చేసుకొన్నారు. ఒక్కసారి కళ్ళుమూసుకొన్నాను. వెయ్యిజ్యోతులు కళ్ళముందు వెలిగాయి. గుళ్ళో గంటలన్నీ ఒక్కసారి కంగుమని మోగాయి. ఎదురుగుండా నా ఏడుగురుపిల్లలు, నా భార్య చేతులో కొబ్బరికాయ చెక్క కోసం చుట్టూ చేరి పెనగులాడుతున్న దృశ్యం కళ్ళకు కనబడింది. ఎప్పటికో యీ దారిద్ర్యానికి అంతం? మరో దృశ్యం........ జీవితంలోని కష్టాల ఫలితంగా బెరడుకట్టిన హృదయాలతో శిలాప్రతిమల్లాగ మేష్టారు దంపతులు .... .... వాళ్ళచుట్టూ దీనంగా నిలబడ్డ పెద్దకొడుకూ, తల్లిలేని నలుగురభాగ్యపు మనవలు, కాలాని కెదురీత లీదుతూ కుటుంబంకోసం త్యాగం చేస్తున్న రెండోకొడుకూ క్షయరోగంతో చావు కెదురుచూస్తున్న మూడో కొడుకూ బ్రతుకుతెరువు కోసం మృత్యువుకి తలొగ్గి సైన్యంలో చేరిన నాల్గో కొడుకు భావి జీవితాలను గురించి అమాయకంగా మధురస్వప్నాలు కాంచే బాల్యావస్థలోనున్న ఆఖరి కొడుకు, చిన్నకూతురు, దారిద్ర్యఫలితంగా పండు యౌవనాన్ని ముసలిభర్తల చేతులలోబెట్టి తీరని కోరికల్తో అవమానంతో కుమిలి కుమిలి ఏడ్చే యిద్దరు కూతుళ్ళు, అంతకంటే అభాగ్యురాలైన బాల్య వితంతువు, జీవిత మొక దీర్ఘ దుస్వప్నంగా పరిణమించిన గర్భవతైన కోడలూ కనబడ్డారు. హుఁ .... .... .... ఆయనకి దేవుడుమీద నమ్మక మేముంటుంది? దేవుడే వుంటే .... దొంగవర్తకులమీద చూపెట్టిన దయ యిలాంటి కష్టజీవులమీద చూపెట్టడేం? ఇంతలో మరో దృశ్యం .... మెట్ల పొడుగునా గుడ్డలుపరచుకొన్న కుంటి, గుడ్డి, మూగ బిక్షుకులందరూ ఒకసారి దీనంగా ఎలుగెత్తి అరుస్తున్నారు.

'ముందర మాకేసి చూసి తర్వాత దేవుణ్ణి చూడండి. ఆలయద్వారం ముందరే, దేవుడు పాదాల దగ్గరే ఆకలితో మలమలమాడి చస్తున్నాం. దేవుడు చేసేదేమీ లేదు. మనిషికి మనుషే దిక్కు ధర్మంచేసి ప్రాణాలు రక్షించండి . .. బాబూ!' అంటూ యాత్రికుల కాళ్ళకడ్డంపడుతున్నారు మేస్టారి మాటలు జ్ఞాపకమొచ్చాయి. 'మానవుడికి అతీతమైందేదీలేదు. తల్చుకుంటే ఈ లోకాన్ని స్వర్గతుల్యంగా చేయగలడు కాని, తన స్వార్థాన్ని పురస్కరించుకొని దేవుడనే సాకుతోటి తన జాతి ధర్మాన్ని తన బాధ్యతని అతిక్రమిస్తున్నాడు అవును దేముడో మిథ్య అని రుజావు చేయడానికి ఈ ధనవంతుల స్వార్థాన్ని నిరూపించడానికి ఈ గుడి నంటిపెట్టుకొని భయంకర నరకాన్ననుభవిస్తున్న ఈ నిర్భాగ్య భిక్షువులే ప్రత్యక్ష నిదర్శనాలు .... .... ఇంతలోనే మరో దృశ్యం .... .... బేడకాసు మార్చి ఆరుకానులు ధర్మం చేసిన భద్రయ్య ఆ కుంటివాడికి ప్రాణం విసిగి ఓ కాసీ వేద్దామనుకొంటుంటే అడ్డంవచ్చిన ఆఫీసర్ ఆ రెండు డబ్బులూ ఆ విశ్వేశ్వరుడి విగ్రహం ఎదుట తన అవసరానికి తీసుకొన్నాడు. న్యాయంగా అందులో ఓ కాని ఆ కుంటాడి గుడ్డమీద పడవలసింది. మేష్టారన్నట్టు నిజానికి మనిషికి డబ్బుమీద వున్న నమ్మకం దైవంమీద లేదు. తన అహంభావంచేత ఆ కుంటాడికి అక్కడ కానీ వెయ్యనివ్వలేదు. న్యాయార్జితం కాని సొమ్ముతో తను చేసిన యాత్రలు, పూవులు, దానాలు, ఆ దేముడు కళ్ళుమూసుకొని స్వీకరిస్తాడనే చేసేడా? కాదు. మేస్టారు చెప్పిందే నిజం. మానవుడు ముందర రూపాయ అణాపైసలు లెక్క పెట్టుకుని తర్వాత ముక్తి మార్గం ఆలోచిస్తాడు. పైగా గతిలేక ముష్టెత్తుకునే వాళ్ళని తిట్టేడు ... హుఁ.... మేష్టారన్నట్లు ఈ ఆఫీసరు మాత్రం ముష్టివెధవకాడూ? ఆ కుంటాడు చేతిలో పడే కానీ లాక్కున్నాడు! ఆ దౌర్భాగ్యుడు ముష్టివెధవౌతే, వాడి కానీ లాక్కున్నవాడినేమనాలి?

నేను మళ్ళీ కళ్ళు తెరచేటప్పటికి ఆలయ మండపం యధాతథంగా వుంది. ఇంకా వాళ్ళిద్దరూ సంతాన స్తంభాన్ని కావిలించుకునే వున్నారు. *